RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | బుధవారం | 10.07.2024
సంపుటి 325 | సంచిక 1 | పేజీలు : 03 | వెల : రూ.5



## సీఎం రేవంత్‌తో క్రికెటర్ సిరాజ్ భేటీ

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :** టీమిండియా పేసర్ మహమ్మద్ సిరాజ్ నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత దేశానికి, మన తెలంగాణ రాష్ట్రానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిన ఆల్ రౌండ్ క్రికెటర్ సిరాజ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. టీ20 వరల్డ్ కప్ లో సిరాజ్ అద్భుతమైన ప్రతిభను కనబరిచారని ముఖ్యమంత్రి కొనియాడారు. అనంతరం సిరాజ్ టీమిండియా జెర్సీని సీఎం రేవంత్ రెడ్డికి బహుకరించారు.

..మిగతా 2 లో

# మార్పు దిశగా భారత్

- అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయడమే లక్ష్యం
- డిజిటల్ పేమెంట్లలో సరికొత్త రికార్డ్‌లు
- రష్యా పర్యటనలో మోడీ ప్రసంగం



**మాస్కో - ప్రభాత సూర్యుడు :**
ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రష్యా పర్యటనలో ఉన్న ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను ఒంటరిగా రష్యాకు రాలేదని 140 కోట్ల మంది భారతీయుల ప్రేమతో వచ్చానన్నారు. భారత్ జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించిందని., డిజిటల్ పేమెంట్లలో సరికొత్త రికార్డ్‌లను సృష్టించామన్నారు. దేశం మారుతోందని ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జీని నిర్మించాం. పదేళ్లలో ముప్పై వేల కిలోమీటర్ల రైల్వే లైన్ల ఎలక్ట్రిఫికేషన్లు చేశాం. పదేళ్లలో ఎయిర్ పోర్ట్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తామని ప్రకటించారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమే, అసలు అభివృద్ధి ముందు ముందు ఉంటుందన్నారు. దేశాభివృద్ధిలో 140 కోట్ల భారతీయుల కృషి ఉందని.. సవాలు..సవాళ్లు నా డీఎన్ఏలో ఉన్నాయి. గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిపై ప్రపంచమే ఆశ్చర్యపోయిందని గుర్తు చేశారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ 15 శాతం సహకరిస్తోందన్న మోదీ, 2014కి ముందు అంధకారంలో ఉందన్నారు. ఐసీసీ వరల్డ్ టీ20లో భారత్ విజయాన్ని మీరు ఘనంగా జరుపుకున్నారు. విజయమే అంతిమ లక్ష్యం. భారత యువత చివరి క్షణం వరకు పట్టు వదలరని ప్రశంసించారు. ప్రతి భారతీయుడు దేశాన్ని మార్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. భారతదేశ విజయాల గురించి ఎన్నారైలు గర్వంగా మాట్లాడుతున్నారని.. ఈ రోజు భారత్ చంద్రుని భాగంలోకి చంద్రయాన్ పంపింది. మరే ఇతర దేశం ఆ స్థాయికి చేరుకోలేదని గుర్తు చేశారు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను భారత్ కలిగి ఉందన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రగామిగా కొనసాగుతోందని.. భారత్‌ను మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటించారు. నెల రోజుల క్రితం మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశాను. నా మూడో టర్మ్‌లో మూడింతల శక్తితో పని చేస్తానని ఆ రోజు ప్రతిజ్ఞ చేశానని అని ప్రధాని మోదీ ప్రవాస భారతీయులగు గుర్తు చేశారు. ప్రధానిగా మూడో సారి బాధ్యతలు చేపట్టిన మోదీ తొలిసారి రష్యాలో పర్యటిస్తున్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య పలు అంశాలపై చర్చలు జరగనున్నారు, ఫైటర్ జెట్ 57పై ఒప్పందం. భారతదేశంలో యాంటీ ట్యాంక్ షెల్స్‌ను తయారీ పరిశ్రమకు సంబంధించి ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది.భారత్ కు ఘన స్వాగతం, మై బెస్ట్ ఫ్రెండ్ మోదీ. భారత్‌రష్యా బంధం ఏ రేంజ్‌లో ఉందో చెప్పడానికి ఈ ఒక్కమాట చాలు. మాస్కోలో అచ్చంగా ఇదే జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ఆకాశానికి ఎత్తేశారు. తన బెస్ట్ ఫ్రెండ్ అంటూ సంబోధించారు. రష్యాకు వచ్చిన

..మిగతా 2 లో



## రైతు సంక్షేమానికే పెద్దపీట

- వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్లు రుణాలు
- గృహ నిర్మాణానికి రూ.11500 కోట్లు రుణాలు
- స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ మీటింగ్ లో నిర్ణయాలు

**విజయవాడ - ప్రభాత సూర్యుడు**
సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో 227వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. 202425 ఆర్థిక సంవత్సరానికి గాను రుణ ప్రణాళిక విడుదల చేసారు.
202425 ఆర్థిక సంవత్సరానికి రూ.5,40,000 కోట్లతో రుణ ప్రణాళిక విడుదల చేసారు. రూ.3,75,000 కోట్లు ప్రాధాన్య రంగాలకు, రూ.1,65,000 కోట్లు ఇతర రంగాలకు కేటాయిస్తూ రుణ ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్లు రుణాలు లక్ష్యం. అంటే గతం కంటే 14 శాతం అధికంగా రుణాలు. డైరీ, పౌల్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ యాంత్రీకరణకు, వ్యవసాయం రంగంలో మౌళిక సదుపాయాలకు రూ.32,600 కోట్లతో రుణ ప్రాణాళిక, 2023`24 ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యతా రంగానికి రూ.323000 కోట్లు పెట్టుకోగా...ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.375,000 కోట్లు రుణ ప్రణాళికా లక్ష్యం. గతంతో పోల్చితే 16 శాతం అధికంగా రుణాల లక్ష్యంగా ఎంచుకున్నారు.
వ్యవసాయ రంగానికి గత సంవత్సరం రూ.231000 కోట్లు రుణ లక్ష్యం గాపెట్టుకోగా అందులో 90 శాతం అనగా రూ.208136 కోట్ల రుణాలు మంజూరు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడే ఓఞఇ రంగానికి 2023`24ఏడాదిలో రూ.69,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఈ ఏడాది ఏకంగా రూ.87,000 కోట్లు లక్ష్యం. అంటే 26 శాతం అధికంగా రుణాలు ఇవ్వాలని ప్రణాళిక. అలాగే గృహ నిర్మాణానికి రూ.11500 కోట్లు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక. సాంప్రదాయేతర ఇంథన సెక్టార్ కు రూ. 8000 కోట్లు రుణ ప్రాణాళిక సిద్దం. 5 ప్రధాన అంశాలపై మెరుగైన ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, బ్యాంకర్లతో సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. .వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించడం, కౌలు రైతులకు సులభంగా రుణాలు అందించడం, మెరుగైన పంటల బీమాను అందుబాటులోకి తేవడం,. పి 4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసరమైన ప్రాజెక్టులు, ప్రణాళిక చేపట్టడం, .డిజిటల్ లావాదేవీల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడం, స్కిల్ డవల్మెంట్ కు చర్యలు తీసుకోవడం, సంపద సృష్టించే, జివిస్ డిపి పెంచే రంగాలకు తగు ప్రోత్సాహం ఇవ్వడంపై మంత్రులు, బ్యాంకర్లు, ఆయా రంగాల నిపుణులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. 4వ సారి ముఖ్యమంత్రి అయిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఎస్.ఎల్.బీ.సీ సమావేశం శుభాకాంక్షలు తెలిపింది. ఈసమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు, యూనియన్ బ్యాంక్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ రుద్ర, ఎస్.ఎల్.బీసీ కన్వీనర్ సీవిఎన్ భాస్కర్ రావు, ఇతర బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## డీఎస్సీలో మార్పు లేదు

- యధావిధిగా పరీక్షలు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :**
తెలంగాణ డీఎస్సీ పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ క్లారిటీ ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని, ఎట్టిపరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. ఇటీవల సబ్జెక్టులు, పోస్టుల వారీగా పరీక్షల తేదీలతో కూడిన పూర్తిస్థాయి షెడ్యూల్‌ను వెల్లడిరచిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి. ఇవే తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ పేర్కొంది. అయితే ఇటీవలే టెట్ ఫలితాలు విడుదలయ్యాయని.. టెట్‌కు, డీఎస్సీకి భిన్నమైన సిలబస్ ఉండటంతో చదవడానికి సమయం సరిపోవడం లేదని పలువురు అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.ఈ క్రమంలో వారంతా సోమవారం ఉదయం లక్డీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడిరచి, నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ డీఎస్సీ పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని ప్రకటన విడుదల చేసింది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో మొత్తం 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోస్టులకు 2.79 లక్షల దరఖాస్తులు వచ్చాయి. జులై 17 నుంచి మొత్తం 13 రోజులపాటు పరీక్షలు జరగనున్నాయి.తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. గతేడాది సెప్టెంబర్ 12 నుంచి అక్టోబర్ 3 వరకు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పరీక్షకు సంబంధించి అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా జనరల్ ర్యాంకులను టీజీపీఎస్సీ విడుదల చేసింది. పరీక్ష రాసిన అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌లో ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసింది. అయితే త్వరలోనే పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 1:5 నిష్పత్తిలో మరో జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపింది. కాగా మొత్తం 1,392 జూనియర్ లెక్చరర్స్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఈ నియామక ప్రక్రియను చేపట్టింది

## నిర్దేశిత గడువు లోగా ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**
**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**




ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

..మిగతా 2 లో

## ఢిల్లీ కేంద్రంగా జగన్ రాజకీయం

..మిగతా 3 లో



## ఏపీ మహిళలకు చంద్రబాబు సర్కార్ గుడ్ న్యూస్

**అమరావతి - ప్రభాత సూర్యుడు**

కార్యాచరణలోకి తీసుకువచ్చే విధంగా సీఎం ప్లాన్ ఏపీలో భారీ విజయం సాధించిన కూటమి సర్కార్..అదే తరహాలో ప్రజలకు వరుసపెట్టి శుభవార్తలు చెబుతోంది. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నారు. సీఎం చంద్రబాబు. సామాన్యుడికి మేలు కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకుంటు న్నారు. ఇప్పటికే ఏపీలో పింఛన్లకు స్వీకారం చుట్టిన చంద్రబాబు..మరో హామీ అమ లుకు సిద్ధమైనట్లు సమాచారం. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా ఆడ బిడ్డ నిధి పథకాన్న త్వరలోనే

..మిగతా 2 లో

# పార్టీ ఫిరాయింపులపై జాతీయ స్థాయిలో పోరాటం

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**
తెలంగాణలో జరుగుతున్న పార్టీ ఫిరాయింపులపై జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీష్‌రావు, ఎంపీ సురేష్ రెడ్డితో కలిసి డిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్., కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫిరాయింపులపై పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఇప్పుడెందుకు నోరు తెరవడం లేదని ప్రశ్నించారు. వాటన్నింటినీ గుర్తు చేస్తూ.. కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయపెట్టేందుకు జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామన్నారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి మారిన వారిని రాళ్లతో కొట్టాలని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ నేతలను ఎందుకు కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ప్రశ్నించారు కేటీఆర్. తమ పార్టీ అధికారంలోకి వస్తే 10 షెడ్యూల్‌ను తప్పకుండా అమలు చేస్తామని ప్రతి మీటింగ్‌లో చెప్పిన రాహుల్ గాంధీ ఇప్పుడు చెప్పే సమాధానం ఏంటని నిలదీశారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలను, ఆరుగురు ఎమ్మెల్సీలను కాంగ్రెస్ పార్టీలో చేరుకున్నారు. వారితో ఎప్పుడు రాజీనామా చేయిస్తారని రాహుల్‌ను ప్రశ్నించారు. ఈ పార్టీ ఫిరాయింపులపై ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో కేసు నడుస్తోందని అవసరమైతే సుప్రీం కోర్టులో కూడా కేసు వేస్తామని గత తీర్పులను ఒక్కసారి గమనిస్తే కచ్చితంగా బీఆర్ఎస్ గెలుస్తుందని అన్నారు కేటీఆర్.



తెలంగాణలో జరుగుతున్న పార్టీ ఫిరాయింపులపై లోక్‌సభ స్పీకర్‌ను, ఎన్నికల సంఘాన్ని, రాష్ట్రపతిని కూడా కలుస్తామని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్, టీడీపీ,

..మిగతా 2 లో

# మార్పు దిశగా భారత్



మొదటిపేజీ తరువాయి

మన ప్రధాని మోదీకి మాస్కో అవతల ఉన్న అధ్యక్షుడి నివాసంలో లభించిన గ్రాండ్ వెల్‌కమ్ ఇది. అమెరికా, యూరప్ తోపాటు మాజీ సోవియట్ దేశాలు పుతిన్‌పై కత్తులు నూరుతున్నవేళ, భారత ప్రధాని టూర్, రష్యాకు పెద్ద బలాన్ని, గొప్ప రిలీఫ్‌ని ఇచ్చింది. కరోనా తర్వాత ప్రధాని తొలిసారి రష్యా వెళ్లారుఇది పూర్తి అధికారిక కార్యక్రమం కాదు. కానీ మర్యాదపూర్వకంగా సాగిన ప్రైవేట్ కార్యక్రమం. పెద్ద ఎస్టేట్‌లా కనిపిస్తున్న ఈ ప్రాంతంలో మోదీ,పుతిన్ గంటపాటు చర్చించారు. షేక్‌హ్యాండ్‌లు, ఆలింగనాలు, బ్యాటరీ వాహనాల్లో ప్రయాణిస్తూ, ఇద్దరు నేతలు ప్రపంచ దేశాలను ఆకర్షించారు. భారత్`రష్యా మధ్య ఉన్న చిరకాల మైత్రీబంధానికి ఈ మీటింగ్ ఒక నిదర్శనం. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరు దేశాధినేతలు ఈ చాయ్‌పే చర్చలో, డిన్నర్ మీటింగ్‌లో మాట్లాడుకున్నారు,ఈ క్రమంలో రష్యా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ రష్యా ఆర్మీలో పనిచేస్తున్న భారతీయులను స్వదేశానికి రప్పించే అంశాన్ని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రస్తావించారు. దీని తరువాత, అధ్యక్షుడు పుతిన్, భారతీయులు త్వరలో దేశానికి తిరిగి వస్తారని ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు.వాస్తవానికి, రష్యా సైన్యం తోపాటు ఉక్రెయిన్‌పై పోరాడటానికి భారతీయ పౌరులను బలవంతంగా తరలిస్తున్నారన్న వార్తలు వచ్చాయి. భద్రతా సహాయకులుగా పని చేసేందుకు భారతీయులను మోసపూరితంగా సరిహద్దులకు పంపుతున్నారు కొందరు ఏజెంట్లు. నవంబర్ 2023 నుండి రష్యా`ఉక్రెయిన్ సరిహద్దులో దాదాపు 18 మంది భారతీయులు చిక్కుకుపోయారని ఒక ఏజెంట్ సమాచారం ఇచ్చారు. ఈ సమయంలో ఒకరు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇద్దరు దేశాధినేతల భేటీతో బలవంతంగా చిక్కుపోయిన భారతీయులకు విముక్తి లభిస్తోంది.ఇదిలావుంటే, రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని మోదీ ఇప్పటికే డిన్నర్ మీటింగ్ నిర్వహించారు. ఇవాళ రెండు దేశాల ప్రతినిధుల స్థాయి చర్చలు జరుగుతాయి. అలాగే రొసాటోమ్ పెవిలియన్‌ను ప్రధాని మోదీ సందర్శిస్తారు. న్యూక్లియర్ టెక్నాలజీలో రష్యా సాధించిన విజయాలకు సంబంధించిన ఎగ్జిబిషన్‌లో మోదీ పాల్గొంటారు. ఆ తర్వాత 22వ రష్యా`ఇండియా సదస్సులో పుతిన్‌తో కలిసి మోదీ పాల్గొంటారు. అయితే ప్రధాని మోదీ రష్యా టూర్‌పై అమెరికా ఆచితూచి స్పందించింది. ఉక్రెయిన్ విషయంలో ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు అనుగుణంగానే, మోదీ స్పందించాలని అగ్రరాజ్యం కోరింది. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అనీ, అయితే ఇందులో రష్యా విషయంలో సంబంధాలు కూడా ముఖ్యమేనని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ చెప్పారు.



## చేనేతల ప్రాణాలు తీస్తున్న
# కాంగ్రెస్ సర్కార్

- బతుకమ్మ చీరల పంపిణీ నిలిపివేసే కుట్ర
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆత్మహత్యలు
- ఇప్పటికే 10 మంది నేతన్నల ఆత్మహత్యలు
- ఆనాలోచిత నిర్ణయాలు మాని చేనేతలకు ఉపాధి కల్పించాలని కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక చేనేతల పై కక్ష గట్టి వారి ప్రాణాలు తీస్తుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నేతన్నలు, చేనేతల ఆత్మహత్యలు నివారించి వారికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభించామన్నారు. 7 ఏళ్ల పాటు కొనసాగిన ఈ బతుకమ్మ చీరల ఆర్డర్ల కారణంగా రాష్ట్రంలో చేనేతలు, నేతన్నల ఆత్మహత్యలు ఆగిపోయాయని గుర్తు చేశారు. ఏటా రూ. 350 కోట్ల బడ్జెట్ తో బతుకమ్మ, రంజాన్, క్రిస్ మస్ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కోటి చీరలను పంపిణీ చేసేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేయాలని కుట్ర చేస్తుందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ సదుద్దేశంతో చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కారణంగా పేద మహిళలకు పండుగ పూట ప్రభుత్వ కానుకగా చీర అందేదన్నారు. అదే విధంగా చేనేత కార్మికులు, నేతన్నలు అనుబంధంగా ఎంతో మంది ఉపాధి పొందే వారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తమ ప్రభుత్వం మీద కక్షతో నేతన్నలు, చేనేతల ఉసురు తీయవద్దని ట్విట్టర్ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేసిన కారణంగా ఇప్పటికే 10 మంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ ఆర్డర్లు రద్దు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన ఆర్టికల్ ను ట్విట్టర్ లో కేటీఆర్ పోస్ట్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాలోచిత చర్యలు మాని వెంటనే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి నేతన్నలు, చేనేతలకు ఉపాధి కల్పించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



# సీఎం రేవంత్‌తో క్రికెటర్ సిరాజ్ భేటీ

మొదటిపేజీ తరువాయి

కాగా, ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కోమటి రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీమిండియా మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కూడా పాల్గొన్నారు. ఇటీవల, టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచ కప్ విజయం తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన భారత పేసర్ మహ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. బాణసంచా కాల్చడంతో దేశభక్తి గీతాలతో అభిమానులు 30 ఏళ్ల హైదరాబాద్ పేసర్‌కు స్వాగతం పలికారు. కాగా, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి రూ.125 కోట్ల బహుమతిలో వాటాను సిరాజ్ కూడా అందుకోనున్నారు. మహ్మద్ సిరాజ్ సహా 15 మంది ఆటగాళ్లలో ఒక్కొక్కరికి రూ.5 కోట్లు అందనున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 7 పరుగుల తేడాతో ఓడించి టీ20 ప్రపంచకప్‌ను భారత్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. సిరాజ్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో లేదా చుట్టుపక్కల ప్రాంతాల్లో అందుకు అనువైన స్థలాన్ని గుర్తించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# పార్టీ ఫిరాయింపులపై జాతీయ స్థాయిలో పోరాటం



మొదటిపేజీ తరువాయి

బీజేపీ నేతలను ఇలా రాజీనామాలు చేయించకుండానే పార్టీలో చేర్చుకుంది కదా అన్న సమాధానానికి కేటీఆర్ స్పందించారు. పార్టీ లెజిస్లేచర్‌ను విలీనం చేర్చుకోవడం వేరని, నేతలు ఫిరాయించడం వేరని అన్నారు. అది రాజ్యాంగ బద్ధమని చట్టం ప్రకారం అది చెల్లుబాటు అవుతుందని వాదించారు. జాతీయ పార్టీలు చేస్తున్న ఫిరాయింపు రాజకీయాల్లో అన్ని పార్టీలు బలిపశువులే అన్నారు కేటీఆర్. యాంటి డిఫెక్షన్‌లా తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీయే వలసలను ప్రోత్సహించిందని చరిత్ర గుర్తు చేశారు కేటీఆర్. ఇప్పుడు కూడా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... వలసను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు మర్చిపోయి ఆరుగురు ఎమ్మెల్యేలు ఆరుగురు ఎమ్మెల్సీలను చేర్చుకుందన్నారు. గోవా, కర్ణాటకలో బీజేపీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తుందని రాహుల్ చెప్పుకుంటూ... ఇప్పుడు తెలంగాణాలో ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను సుప్రీం కోర్టు డిస్ క్వాలిఫై చేసిందని గుర్తు చేశారు. ఎవరైనా ఎమ్మెల్యే, ఎంపీ పార్టీ ఫిరాయిస్తే వారిని డిస్ క్వాలిఫై అయ్యేలా చట్టం తీసుకురావాలని రాహుల్ గాంధీ చెప్పారని వెల్లడించారు. ఏపీ రాజకీయాలపైనా కేటీఆర్ స్పందించారు. ఎన్నికలకు ముందు జగన్ గెలుస్తారని తమకు సమాచారం ఉందని పదే పదే కేటీఆర్, కేసీఆర్ చెప్పేవారు. ఈ అంశంపై మీడియా ప్రతినిధులతో భిన్నంగా స్పందించారు. పేదలకు పెద్ద ఎత్తున పథకాలు ఇచ్చినా జగన్ ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. అయినా 40 శాతం ఓట్లు సాధించడం మాములు విషయం కాదని.. పవన్ విడిగా పోటీ చేసి ఉంటే ఫలితాలు మరో విధంగా ఉండేవన్నారు. ప్రతి రోజూ జనంలోకి వెళ్ళే ధర్మవరం కేతిరెడ్డి ఓడిపోవడం కూడా ఆశ్చర్యం కలిగించిందన్నారు. జగన్‌ను ఓడించేందుకు షర్మిలను ఒక వస్తువులా ఉపయోగించారని .. అంతకు మించి షర్మిలకు బలం ఏమీ లేదన్నారు.ఫిరాయింపుల వల్ల బీఆర్ఎస్‌కు నష్టమే: హరీష్ రావు హరీష్ రావు కూడా మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఫిరాయింపుల వల్ల మాకు లాభం జరగలేదని.. మా పార్టీలు చేరిన వాళ్ళల్లో పది మంది ఓడిపోయారని గుర్తు చేసుకున్నారు. సుప్రీం తీర్పు ప్రకారం మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలనన్నారు. తెలంగాణలో మళ్ళీ అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే నన్నారు. ప్రజలు ప్రస్తుతం ప్రభుత్వానికి గత ప్రభుత్వానికి వ్యత్యాసం చూస్తున్నారని.. రేవంత్ రెడ్డికి పాలన పై పట్టు రాలేదు..పాలన వదిలేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు మా చేతుల్లో అన్నారంటే అది వారి చేతగాని తనం అన్నట్టేనని స్పష్టం చేశారుపార్లమెంట్‌లో రాహుల్ రాజ్యాంగాన్ని చూపిస్తారు కానీ ఆ రాజ్యాంగాన్ని ఫాలో అవ్వరని విమర్శించారు. తెలంగాణలో ఎమ్మెల్యేలను ఎన్ని కోట్లు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు



# వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీఎంకు లేఖ

జగిత్యాల - ప్రభాత సూర్యుడు

ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో కీలకపాత్ర పోషించే వీఆర్వో వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కోరారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన వారికి అందించడంతో పాటు భూసమస్యలు పరిష్కారంలో గ్రామ రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీతో పాటు పదోన్నతుల్లో వివక్ష చూపుతున్నారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తోనే తమ ఉద్యోగాలకు భద్రత లభిస్తుందని, తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే విశ్వాసంతో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సైతం గ్రామ గ్రామాన ప్రజల్లో తెలంగాణ భావజాల వ్యాప్తి పెంపొందించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించి, భాగస్వాములు అయిన వీఆర్వో వ్యవస్థనే రద్దు చేయడం దురదృష్టకమన్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్వో వ్యవస్థకు ఎటువంటి ప్రత్యామ్నయం ఏర్పాటు చేయకుండ రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లోని వీఆర్వో వ్యవస్థను ఏకపక్షంగా రద్దు చేస్తున్నామంటూ రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న సుమారు ఐదు వేల వీఆర్వో పోస్టులను ఒక్క కలం పోటుతో రద్దు చేసి, రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఐదు వేల ఖాళీ పోస్టుల్లో వీఆర్వోలను సర్దుబాటు చేయడంతో సుమారు 10 వేలకు పైగా ప్రభుత్వ విభాగాల్లో భర్తీ చేసే పోస్టులను రద్దు చేసి, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. గ్రామాల్లోని రెవెన్యూ భూముల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి, భూసమస్యలు పరిష్కరించడంతో పాటు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పంటలు నష్టపోయినప్పుడు, నష్టపరిహారం అంచనా వేయడంతో పాటు వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా నివేదిక రూపొందించి, పరిహారం సైతం పంపిణీ చేయటంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హులను ఎంపిక చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయటంలో ప్రధాన భూమిక పోషించడంలో కీలక పాత్ర పోషించిన వీఆర్వోల సేవలను మరోమారు క్షేత్రస్థాయిలో భూసమస్యల పరిష్కారంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పకడ్బందీగా అమలు కోసం వీఆర్వోల వ్యవస్థను పునరుద్ధరించి, రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తగు చర్యలు చేపట్టగలరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖ లో కోరినట్లు తెలిపారు.

# నిర్దేశిత గడువు లోగా ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

వన మహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, వానకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, పెండిరగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఉద్యోగుల సాధారణ బదిలీలు వంటి పలు అంశాలను సీఎస్ సుదీర్ఘంగా సమీక్షించారు.



ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ. వన మహోత్సవం కార్యక్రమం క్రింద నిర్దేశించిన లక్ష్యం మేరకు అవసరమైన మేర మొక్కలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలలో పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్ లలో మొక్కల పెంపకం పై ప్రత్యేక దృష్టి సారించాలని, గతంలో నాటిన మొక్కలలో చనిపోయిన మొక్కలను రిప్లేస్ చేయాలని అన్నారు. ఇంటింటికి పంపిణీ చేసే మొక్కల పెంపకం, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదుక్కుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు , మహిళా సంఘాల చే విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టడం నిర్వహించామని, ప్రస్తుతం క్యాంటీన్లు, మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 936 నూతన మీ సేవా కేంద్రాల ఏర్పాటు చెయ్యాల్సిన అవసరం ఉందని, వీటిలో వీలైనంత మేర మహిళా సంఘాల సభ్యులచే ఏర్పాటు చేయాలని, ఆసక్తి , అర్హత గల మహిళల గుర్తింపు, వారి శిక్షణ, రూ. 2.5 లక్షల బ్యాంకు లింకేజ్ రుణం వంటి అంశాలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని సిఎస్ అన్నారు.

జిల్లాలో ప్రముఖమైన ప్రదేశాలలో మహిళా సంఘాలచే అమ్మ క్యాంటీన్ లను ఏర్పాటు చేయాలని, క్యాంటిన్ లలో నాణ్యమైన పదార్థాలు వినియోగించాలని సూచించారు. మహిళా శక్తి కింద ఇతర వినూత్న కార్యక్రమాలను అమలు చేసేందుకు సలహాలు సూచనలు ఉంటే ప్రభుత్వానికి అందజేయాలని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి శాఖ, మెప్మా ల ద్వారా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వీలైనంత మేర మహిళలను మహిళా సంఘాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర నూతన మహిళా సంఘాల ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా సంఘాల జిల్లా సమాఖ్య సమావేశం, మండల సమాఖ్య సమావేశాలు రెగ్యులర్గా నిర్వహించాలని ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని, ఆ రుణాలతో మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా అవసరమైన కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల చివరి దశ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సీఎస్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి రెండవ జత ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలని అన్నారు.

వానకాలం ప్రారంభమై మంచి వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంటల సాగు పెరుగుతుందని, రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. విత్తనాల లభ్యత అంశాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని అన్నారు. రైతు భరోసా వర్క్ షాప్ లో పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ, మల్లేరియా కేసుల వ్యాప్తి అరికట్టాలని, స్థానిక సంస్థల అధికారులు పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామాలు, పట్టణాలలో రెగ్యులర్ గా ఫాగ్గింగ్ నిర్వహించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు.

పెండిరగ్ ధరణి దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లా స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఉత్తర్వులు నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని అన్నారు.



# ఏపీ మహిళలకుచంద్రబాబు సర్కార్ గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారని తెలుస్తోంది. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతీ పథకాన్ని అమలు చేసే యోచనలో ఏపీ సర్కార్ ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగానే 18ఏళ్లు నిండిన ప్రతీ మహిళల ఖాతాలో ఫ్రీగా నెలకు రూ. 1500 చొప్పున జమ చేసే విధంగా ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రవేశపెట్టబోతోంది. అయితే ఈ పథకం దరఖాస్తుకు ముందస్తుగా రెడీ చేసుకోవాల్సిన ధ్రువపత్రాల వివరాలు ఇవే అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నడుస్తోంది. ఆ వివరాల ప్రకారం..ప్రతి మహిళలకు 18ఏండ్లు వయస్సు దాటి ఉండాలి. ఆధార్ కార్డు, రేషన్ కార్డు తప్పనిసరి. అదేవిధంగా పుట్టిన తేదీ ధ్రువపత్రము, మహిళ పేరుతో బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డుతో ఫోన్ నెంబర్ లింక్ అయి ఉండాలి. ఈ వివరాలతో కూడిన సమాచారం ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. వచ్చే నెలలో ఈ స్కీం ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని చెబుతు న్నారు. అటు నిరుద్యోగుల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ కూడా సిద్ధం చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నెలరోజుల లోపే ఇసుక పాలసీని తీసుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇసుక విధానాన్ని రద్దు చేసి నూతన ఇసు క విధానం తీసుకువస్తు న్నారు

RNI: TELTEL12215

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు | జాతీయ తెలుగు దినపత్రిక



## దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ మంత్రులు

**విజయవాడ ప్రభాత సూర్యుడు**
తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, సిడబ్ల్యుసి సభ్యులు రుద్రరాజు తదితరులు మంగళవారం నాడు విజయవాడ కనుకదుర్గ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. వారికి కనుకదుర్గ ఆలయం వద్ద ఆలయ ఈవో మరియు జిల్లా రెవిన్యూ అధికారి, జిల్లా యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ఆలయ అర్చకులు మల్లయ్య శాస్త్రి, మరియు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి గర్భగుడిలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో తెలంగాణ రాష్ట్రం విలసిల్లాలని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. భట్టి విక్రమార్క స్పీచ్ మాట్లాడుతూ ఎన్నో ఆశలు ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వ పాలనలో సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో విలసిల్లాలని కనుకదుర్గ అమ్మవారిని వేడుకున్నానని వెల్లడించారు.

# 10 లక్షల వరకు ఆయుష్మాన్ భారత్

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**
ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ నెలలో పూర్తి బడ్జెట్ (కేంద్ర బడ్జెట్ 2024)ను ప్రవేశపెట్టనుంది. ఈ సారి దేశంలో సంకీర్ణ ప్రభుత్వం ఉంది కాబట్టి అది జనాకర్షకంగా ఉంటుందని సర్వత్రా భావిస్తున్నారు. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై), ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఈ బడ్జెట్ లో కొన్ని కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద కవరేజీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి పెంచే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది, ఆయుష్మాన్ భారత్`ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన లబ్ధిదారుల సంఖ్య, భీమా మొత్తాన్ని పెంచాలని ఎన్డీయే ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ పథకం కింద లబ్ధిదారులకు లభించే కవరేజీ పరిమితిని ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే మూడేళ్లలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం కింద లబ్ధిదారుల సంఖ్యను రెట్టింపు చేయాలని ఎన్డీయే ప్రభుత్వం భావిస్తోంది.రాబోయే మూడేళ్లలో ఏబీ`పీఎంజేఏవై కింద లబ్ధిదారుల సంఖ్యను రెట్టింపు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే.. దేశ జనాభాలో మూడిరట రెండొంతుల మందికి ఆరోగ్య రక్షణ లభిస్తుంది. చికిత్స కోసం భారీగా ఖర్చు చేయడం కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టడానికి ప్రధాన కారణాల్లో ఒకటి కాబట్టి ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తోందని నివేదిక వర్గాలు తెలిపాయి. ఆయుష్మాన్ యోజన కవరేజీ పరిమితిని ప్రస్తుతం




ఉన్న రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు.కేంద్రం ఈ నెలలో సాధారణ బడ్జెట్ ను ప్రవేశపెట్టబోతోంది. జూలై 23న బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నట్లు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలు లేదంటే అందులోని కొన్ని భాగాలను ఈ బడ్జెట్ లో ప్రకటించే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ రూపొందించిన అంచనాల ప్రకారం ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.12,076 కోట్ల అదనపు భారం పడుతుంది. 70 ఏళ్లు పైబడిన వారితో సహా మరో 4`5 కోట్ల మంది లబ్ధిదారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని తెలుస్తోంది.ఆయుష్మాన్ భారత్`పీఎంజేఏవైకి రూ.5 లక్షల పరిమితిని 2018లో నిర్ణయించారు. ఇప్పుడు ద్రవ్యోల్బణం, మార్పిడితో సహా ఇతర ఖరీదైన చికిత్సల విషయంలో కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు, ఈ పథకం కింద అందుబాటులో ఉన్న కవరేజీ పరిమితిని రెట్టింపు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. జూన్ 27న పార్లమెంట్ సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ పథకం వర్తిస్తుందని, వారికి ఉచిత వైద్యం అందుతుందని చెప్పారు.

## సంపాదకీయం

### దెబ్బ తీస్తున్న ప్లాస్టిక్ వినియోగం



పర్యావరణాన్ని కోలుకోని రీతిలో దెబ్బతీస్తున్న ప్రమాదకరమైన అంశాల్లో ప్లాస్టిక్ వినియోగం ఒకటి. గతంలో పట్టణాలకే పరిమితమైన ప్లాస్టిక్ వినియోగం నేడు పల్లెలకూ పాకింది. టీ షాపులు, పండ్ల దుకాణాలు, కిరాణా అంగళ్లలో ప్లాస్టిక్ సంచుల వాడకం బాగా పెరిగింది. ఇలా విచ్చలవిడిగా పెరుగుతున్న ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నివారించి, వాటికి తగిన ప్రత్యామ్నాయాలు వెతుక్కోవాలనే సంకల్పంతో ఏటా ఏటా జులై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే పేరిట జరుపుకుంటున్నాము. 2022లో ప్రపంచంలోనే తొలిసారి బంగ్లాదేశ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించింది. ఆ తర్వాత మనదేశంతో బాటు అనేక దేశాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాయి. మన తెలంగాణ ప్రభుత్వమూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను 2022లోనే నిషేధించింది. 75 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠినచర్యలు తీసుకునేలా జీవో ఇచ్చి.. రెండేళ్లవుతున్నా.. అది అమలులోకి రాలేదు. నేటికీ తెలంగాణ వ్యాప్తంగా అన్ని దుకాణాల్లోనూ యధేచ్ఛగా ప్లాస్టిక్ సంచుల వినియోగం సాగుతూనే ఉంది. ప్లాస్టిక్‌లో బీపీఏ (బిస్ఫెనాల్) అనే రసాయనం హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతుంది. ఇది పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును కోలుకోలేని రీతిలో దెబ్బతీయటంతో బాటు కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకూ కారణమవుతుంది. ప్లాస్టిక్‌లో థాలేట్స్, ఇతర అనేక రసాయనాలు మనుషుల ప్రాణాలను హరిస్తున్నా.. ప్రజల్లో ఈ విషయంపై చైతన్యం అంతంతమాత్రంగానే ఉంది.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటానికి ఉద్యమాలేమీ అవసరం లేదు. మనవంతుగా దానిని వాడకపోతే సరి. జీరోవేస్ట్ ఒకరోజులోనే సాధ్యంకాదు గనుక ఇంపర్ఫెక్ట్ జీరో వేస్ట్ (కొంతైనా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలి) అనే పద్ధతిని ప్రయత్నించొచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనికోసం వారు అనే ఫార్ములాను సూచిస్తున్నారు. ఇందులో తొలి అంశం.. తిరస్కరించటం . బజారులో 4 రకాల కూరగాయలు కొంటే.. 4 ప్లాస్టిక్ సంచులు ఇంటికి చేరుతున్నాయి. ఇవిగాక.. కూల్‌డ్రిరక్ సీసాలు, స్ట్రాలు, టిఫిన్ పార్సిల్‌లో ప్లాస్టిక్ స్పూన్, చివరికి గుడిలో ప్రసాదానికీ ప్లాస్టిక్ ప్లేట్లు. అందుకే గుడ్డ సంచీలు వాడటం, ఇంటిలో అటకెక్కించిన స్టీలు, గాజు, రాగి, మట్టి పాత్రలు, గ్లాసులు తీసి వాడుకోవాలని, భోజనానికి ఆకుల విస్తర్లు వాడుకోవాలని నిపుణు?లు సూచిస్తున్నారు. దీనినే 'సస్టైయినబుల్ లివింగ్' (పర్యావరణ హితమైన జీవన విధానం) అంటున్నాం. షాపుల వాళ్లు.. క్యారీబ్యాగ్స్, డిస్పోజబుల్ గ్లాసులు ఇచ్చినా.. వద్దని తిరస్కరించాలి. బయటికి వెళ్లేటప్పుడు గుడ్డసంచీ పట్టుకుపోతే.. 10 క్యారీ బ్యాగ్స్ వాడకం ఆగిపోయినట్లే. ఇక.. రెండవ అంశ.. తగ్గించటం . ఈ విధానంలో వనరుల దుర్వినియోగాన్ని తగ్గించటం ప్రధాన అంశం. అంటే.. ప్రతి పనికీ వాహనం వాడకపోవటం, ఆఫీసులో అత్యంత అవసరం ఉంటేనే ప్రింటవుట్ తీయటం, వీలుంటే ఆ ప్రింటవుట్ రెండోవైపు వాడుకోవటం, ఇంటిలో ఎల్ఈడీ దీపాలు వాడుకోవటం, వాష్‌రూమ్‌లో షవర్ల బదులు కుళాయిలు వాడటం, ప్లాస్టిక్ బదులు గాజు సీసాలు వాడుకోవటం, అనవసరంగా విద్యుత్ దీపాలు, ఏసీలు వాడకపోవటం వంటివి. ప్రతి వనరును మితంగా వాడుకోవటం వల్ల పర్యావరణం మీద ఒత్తిడి తగ్గుతుందనేది ఇందులో లాజిక్. మూడవ అంశం పునర్వినియోగం. ఆలోచించాలే గానీ పాత బట్టలు, బొమ్మలు, ఫర్నిచర్ వంటివాటిని రీయూజ్‌కు వాడుకోవచ్చు. ఇక.. బొత్తిగా పనికి రాదనుకున్నప్పుడు మాత్రమే వాటిని వదిలించుకోవాలి. నాల్గవ అంశం.. మరోలా మార్చటం . ఇంట్లో అవసరం లేని వాటిని మరో రూపానికి మార్చి వాడుకోవటం. ఈ విషయంలో మనదేశంలో ఇంకా తగినన్ని సదుపాయాలు లేవనే చెప్పాలి. చివరి అంశం.. నిర్మూలించటం (ఖీనీబి). పాతరోజుల్లో ఖాళీ స్థలాలలో పెద్ద గొయ్యి తీసి అందులో అట్టముక్కలు, ఎండుటాకులు, టీపొడి, కోడిగుడ్డు పెంకులు, రంపపు పొట్టు, పండ్లు, కూరగాయలు వంటివన్నీ వేసేవారు. ఏడాదికి అదంతా సేంద్రియ ఎరువుగా మారేవి. కనుక ఇలాంటి ప్రయత్నాలూ అవసరమే. ప్రభుత్వం కేవలం ప్లాస్టిక్ నివారణకు ఆదేశాలు జారీ చేసి ఊరుకోవటమే గాక దాని ప్రత్యామ్యాయాల తయారీ, వినియోగాన్ని ప్రోత్సహించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా.. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జూట్ బ్యాగ్స్ వాడొచ్చిన చెబుతున్నా.. వాటికి ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సహకాలు లభించటం లేదు. అయితే ప్రభుత్వం చొరవతీసుకుని ప్రభుత్వ కార్యాలయాలు, రైతుబజార్లు, దేవాలయాలు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర వాణిజ్య సముదాయాల్లో వీటిని వాడాలనే నియమం తెస్తే వీటి వినియోగం పెరగటమే గాక తయారీ దారులకు డిమాండ్ కూడా పెరుగుతుంది. మరోవైపు.. ప్రజలు కూడా వ్యర్థాల నియంత్రణలో రీథింక్ అనే సూత్రాన్ని పాటించాల్సి ఉంది. ఏదైనా వస్తువు కొనేముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. భవిష్యత్ తరాల కోసం సంపద పోగేయటమే కాదు.. వారికి మంచి ఆరోగ్యాన్ని అందించాల్సిన బాధ్యతా మనమీద ఉందని గుర్తిస్తే.. నేటి నుంచే మనం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోగలము.



## ఢిల్లీ కేంద్రంగా జగన్ రాజకీయం

**విజయవాడ ప్రభాత సూర్యుడు**
అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రాజకీయంపై సస్పెన్స్ నెలకొంది. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన ఆయన మళ్లీ అసెంబ్లీకి హాజరవుతారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఇప్పటి వరకూ వైసీపీ లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని కూడా నిర్వహించలేదు. వైసీపీ ఎల్పీ నేతగా ఆయన అధికారికంగా ఎన్నిక కాలేదు. ప్రతిపక్ష నేత హోదాను స్పీకర్ ఇస్తే ఆయన అసెంబ్లీకి వద్దామనుకుంటన్నారని లేకపోతే లేదని గతంలో విడుదల చేసిన లేఖ ద్వారా రాజకీయవర్గాలు ఓ అంచనాకు వచ్చాయి.ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ప్లాన్ బీ అమలు చేస్తున్నారని వైసీపీ వర్గాలు అంటున్నారు. ప్రతిపక్ష నేత హోదా లేకుండా అసెంబ్లీలో పెద్దగా సంఖ్యాబలం లేకుండా అవమానాలకు గరవడం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదని ప్రస్తుత పరిస్థితుల్లో ఢిల్లీలో రాజకీయం చేయాలని ఆయన అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. అందుకే ఎంపీగా వెళ్లాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతున్నారు. రాజ్యసభ సభ్యులు ఎవరైనా జగన్ కోసం రాజీనామా చేసినా ప్రయోజనం ఉండదు. ఉపఎన్నిక వస్తే టీడీపీనే ఆ స్థానం గెల్చుకుంటుంది. అందుకే జగన్ ఎంపీగా వెళ్లాలంటే ఖచ్చితంగా లోక్‌సభకే ఎన్నిక కావాలి. ఇప్పుడు ఉపఎన్నికలు రావాలంటే వైసీపీకి ఉన్న నాలుగు సీట్లలో ఒకరు రాజీనామా చేయాలి. రెండు రిజర్వుడు సీట్ల నుంచి గెలిచిన ఎంపీ సీట్లు ఉన్నాయి కాబట్టి.. కడప, రాజంపేట సీట్లలో ఎవరైనా రాజీనామా చేస్తే జగన్ పోటీ చేసే అవకాశం ఉంది. కడప నుంచి అవినాష్ రెడ్డితోనే రాజీనామా చేయించి..తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రెండింటికీ ఒకేసారి ఉపఎన్నికలు వచ్చేలా చేయాలని జగన్ అనుకుంటున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి జగన్ బయటకు వచ్చిన తర్వాత అలా ఉప ఎన్నికలు వచ్చాయి. అప్పుడు రికార్డు మెజారిటీలతో గెలిచారు. ఇప్పుడు మరోసారి గెలవ వచ్చని జగన్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కాకపోయినా మూడు నెలల తర్వాత అయినా ఇదే వ్యూహాన్ని అమలు చేయాలనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. పులివెందులలో ఎమ్మెల్యేగా అవినాష్‌రెడ్డిని కాకుండా తల్లి విజయలక్ష్మిని నిలబెట్టాలని., అంతే కాక పార్టీ గౌరవాధ్యక్షురాలిగా కూడా నియమించాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. దీనిపై ప్రాథమిక స్థాయిలో చర్చలు పూర్తి చేశారని.. ప్లాన్ బీ అమలుకు సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నారని వైసీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ప్రస్తుతం అలాంటి చర్చలేమీ జరగడం లేదని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపక్ష నేత హోదా లేకపోయినా జనం కోసం జగన్ ఎదురునిలబడతారని ఇప్పటికే ప్రకటించారని అంటున్నారు. ఏదైనా ప్రజలకు మేలు చేసేలా సమయానుకూలంగా నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు.

## సైకిల్ రాకతో గులాబీ వికసించేనా..?

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంచి రోజులు వస్తున్నట్లే కనిపిస్తున్నాయి. కేసీఆర్ కు కష్ట సమయంలో చంద్రబాబు అనుకోకుండా ఇచ్చిన తెలంగాణలో రీ ఎంట్రీ సానుకూలంగా మారనుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటి వరకూ కేసీఆర్ కు కొంత వ్యతిరేకత తెలంగాణలో కనిపిస్తుందన్న విశ్లేషణలు వెలువడుతున్న నేపథ్యంలో అనుకోకుండానో, కావాలనో టీడీపీ అధినేత చంద్రబాబు తిరిగి తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని భావించడం కొంత కలసి వచ్చే అంశంగానే భావిస్తున్నారు. ఇప్పటి వరకూ బీఆర్ఎస్ పార్టీపై కొంత వ్యతిరేకత ఉన్న తెలంగాణ ప్రజల్లో, మళ్లీ ఏకం కావడానికి చంద్రబాబు ఎంట్రీ దోహదపడుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ నేతలను తమ లీడర్లుగా చూసేందుకు తెలంగాణ ప్రజలు ఇష్టపడరు. అది చంద్రబాబు అయినా.. జగన్ అయినా సరే.. వాళ్లు ఇక్కడ మళ్లీ పెత్తనం చేయడానికి వస్తున్నారనే అభిప్రాయమే కలుగుతుంది. ఆంధ్రావాళ్ల ఆధిపత్యాన్ని వదిలించుకున్నా ఇంకా వెంట పడుతుండటమేంటని ఇప్పటికే సోషల్ మీడియాలో పెద్దయెత్తున తెలంగాణ యువకులు కామెంట్స్ పెడుతున్నారు. మొన్న చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో హైదరాబాద్ వచ్చిన సందర్భంగా పెద్ద పెద్ద హోర్డింగ్ లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై అనేక మంది నేరుగానే అభ్యంతరం తెలిపారు. తెలంగాణ గడ్డ మీద మళ్లీ ఇదేందంటూ సోషల్ మీడియాలో పెద్దయెత్తున కామెంట్స్ వచ్చి పడ్డాయి. దీంతో ఆ ఫ్లెక్సీలను, హోర్డింగ్ లను వెంటనే కొందరు తొలగించడం కూడా అంతే స్పీడ్ గా జరిగింది. బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబును హైదరాబాద్ లో కలవడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరితే ఇప్పటి వరకూ పెద్దగా పట్టించుకోని వారు మాత్రం చంద్రబాబును కలసిన తర్వాత మాత్రం కొంత వ్యతిరేకంగా కామెంట్స్ పెడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, అరెకపూడి గాంధీతో పాటు మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర రావు కూడా చంద్రబాబును కలసిన వారిలో ఉన్నారు. మొన్నటి వరకూ దూరంగా ఉన్న



ఎమ్మెల్యేలు ఇప్పుడు చంద్రబాబుకు దగ్గర కావడంతో ఒకింత బీఆర్ఎస్ కు ప్లస్ పాయింట్ అవుతుందన్న విశ్లేషణలు అయితే జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ తో కలసి బీఆర్ఎస్ ను తెలంగాణలో ఇబ్బంది పెట్టడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో గులాబీ బాస్ కేసీఆర్ పై సానుభూతి పెరిగే అవకాశాన్ని ఎంత మాత్రం కొట్టిపారేయలేం. 2018 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తో కలసి టీడీపీ పోటీ చేసినందునే అప్పట్లో కూటమి అధికారంలోకి రాలేకపోయిందని ఇప్పటికీ గాంధీ భవన్ లో నేతలు చెబుతుంటారు. మరోసారి తెలంగాణ రాజకీయాల్లో కాలు.. వేలు చంద్రబాబు పెడితే అది కేసీఆర్ కు సానుకూలంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కంటే.. రాష్ట్ర సెంటిమెంట్‌నే ఎక్కువ మంది తీసుకుంటారు. అది జగన్ అయినా.. వైఎస్ షర్మిల అయినా.. చంద్రబాబు అయినా సరే... తెలంగాణలో వచ్చి ఇక్కడ రాజకీయాలు చేద్దామంటే కుదరదని నేరుగానే చెబుతున్నారు. చంద్రబాబు ఎఫెక్ట్ బీజేపీ పైనకూడా పడే అవకాశముందని అంటున్నారు. అంతే కాదు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కూడా నష్టం జరగుతుందన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. మొత్తం మీద చంద్రబాబు అలా వచ్చి ఇలా కేసీఆర్ నెత్తిన పాలు పోసి వెళ్లారన్నది మాత్రం ఖచ్చితంగా చెబుతున్నారు కొందరు సీనియర్ నేతలు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

## కేటీఆర్ పాదయాత్ర

**సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నేతల విస్తృత ప్రచారం**

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**
భారత రాష్ట్ర సమితిని మరోసారి బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఆయన పాదయాత్ర చేస్తారనే ప్రచారం జరుగుతోంది. త్వరలో తెలంగాణలోని అన్ని నియోజకవర్గాలను కలుపుతూ కేటీఆర్ పాదయాత్ర చేస్తారని సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నేతలు ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుతం ఓటమి బాధలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. కొంత మంది పార్టీలు వదిలి వెళ్లిపోతున్నారు. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్ కు భారీ యాక్టివిటీ ఉండాలని.. కీలక నేతలు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలన్న అభిప్రాయం ఆ పార్టీ క్యాడర్ లో ఉంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు పాదయాత్ర పెద్ద అస్త్రం. ప్రతి సారి ఎన్నికల సీజన్‌కు ముందు రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలు పాదయాత్రలు చేస్తూనే ఉన్నారు. వైఎస్ రాజశేకర్ రెడ్డి, చంద్రబాబు, జగన్, షర్మిల , లోకేష్‌వరకూ పాదయాత్రలు చేశారు. వారు పాదయాత్రలు చేసినప్పుడల్లా మంచి ఫలితాలు సాధించారు. అయితే షర్మిల మాత్రం రెండు సార్లు పాదయాత్రలు చేసినా ప్రయోజనం పొందలేకపోయింది. అయితే అది అందరికీ వర్కవుట్ అయ్యే సూచనలు లేవు. షర్మిల తెలంగాణ మొత్తం పాదయాత్ర చేశారు కానీ.. కనీసం తనకైనా డిపాజిట్ వస్తుందన్న గ్యారంటీ లేకపోవడంతో కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించి .. తర్వాత కాంగ్రెస్ లో విలీనం అయిపోయారు. బీజేపీ నేత బండి సంజయ్ కూడా విడతల వారీగా పాదయాత్ర చేశారు కానీ కీలక సమయంలో ఆయనను టీ బీజేపీ చీఫ్ పదవి నుంచి తప్పించడంతో పాదయాత్ర ఆగిపోయింది. బీజేపీ కూడా మంచి ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల్లో సాధించలేకపోయింది. ఏపీలో నారా లోకేష్ చేసిన యువగళం పాదయాత్ర టీడీపీకి అధికారాన్ని దగ్గర చేసిందని అనుకోవచ్చు. ప్రస్తుతం బీఆర్ఎస్ ఉన్న గడ్డు పరిస్థితుల్లో కేటీఆర్ కూడా పాదయాత్ర చేయాలని ఆ పార్టీ క్యాడర్ కోరుకుంటోంది. పాదయాత్రలు చేస్తే మంచి ఫలితాలు వచ్చిన చరిత్ర ఉండటంతో కేటీఆర్ కూడా అదే తరహాలో పాదయాత్ర చేస్తే బాగుంటుందని బీఆర్ఎస్ క్యాడర్ ఆలోచన. అందుకే ఆయనపై ఒత్తిడి పెంచేందుకు సోషల్ మీడియా ద్వారా ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. కానీ ఇప్పుడే అలాంటి ప్రయత్నాలు చేయలేమని.. ప్రస్తుతం కవిత బెయిల్ పిటిషన్లపై ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై కేటీఆర్ న్యాయనిపుణులతో చర్చలు జరుపుతున్నారు.



## పాలమూరులో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

**మహబూబ్ నగర్ ప్రభాత సూర్యుడు**
వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ కలెక్టరేట్ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్కలు నాటారు. మహబూబ్ నగర్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో మొత్తం 396.09 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా రూ.353.66 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంవిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.10 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మాణం, దేవరకద్రలో రూ.6.10కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం, మహబూబ్ నగర్ రూరల్ లో రూ.3.25 కోట్లతో కెజివిబి భవన నిర్మాణం, గండీడ్ లో రూ.6.20 కోట్లతో కెజివిబి భవన నిర్మాణం, పాలమూరు యూనివర్సిటీలో రూ.13.44 కోట్లతో టిపి, అకాడామిక్ బ్లాక్, గ్యాలరీ పనులు, మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.37.87 కోట్లతో సిసి రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం,



మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.276.80 కోట్లతో ఎస్ టిపి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ.42.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు



**- తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు**
**- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**
బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కల్యాణ మహోత్సవానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. అమ్మవారికి ప్రభుత్వం తరఫున మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని 27 చీరలు, స్వామివారికి 11 పంచెలతో అలంకారం చేశారు. బల్కంపేట ఎల్లమ్మను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మీ, రాజకీయ నేతలు దర్శించుకున్నారు. పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పొన్నానికి స్వాగతం పలికే సమయంలో స్వల్పంగా తోపులాట జరిగింది. దీంతో ప్రొటోకాల్ పాటించకపోవడంతో పొన్నం అలకబూనారు. కలెక్టర్ అనుదీప్‌కు పొన్నం ప్రభాకర్ ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/ HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215